www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 19 ఫిబ్రవరి 2025

5

కాకినాడ



జెఎన్‌టియుకె విసిగా ప్రసాద్ నియామకం

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె ఉపకులపతిగా ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ నిట్ సివిల్ ఇంజినీరింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఇంజినీరింగ్‌లో ప్రొఫెసర్‌గా ప్రసాద్ విధులను నిర్వహిస్తున్నారు. ఆయనను జెఎన్‌టియుకె విసిగా నియమితులు అయ్యారు. ఇప్పటివరకు జెఎన్‌టియుకెకు ఇన్‌ఛార్జ్ విసిగా మురళీకృష్ణ విధులు నిర్వహిస్తున్నారు.



జెఎన్‌టియుకె విసి ప్రసాద్

తునిలో అమీతుమీ...

- వైస్ చైర్మన్ ఎన్నికపై కొనసాగుతున్న ఉత్కంఠ
- భారీగా చేరుకున్న టిడిపి, వైసిపి శ్రేణులు
- ఉద్రిక్తత పరిస్థితులు నడుమ లాఠీలకు పని చెప్పిన పోలీసులు
- నాలుగో సారి వాయిదా వేసిన అధికారులు



లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కోటనందూరు

తునిలో అమీతుమీ తేల్చుకునేందుకు వైసిపి, టిడిపి శ్రేణులు సిద్ధపడడంతో ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో గత రెండు రోజులుగా తునిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య తీవ్ర వివాదం చోటుచేసుకోవడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. తుని మున్సిపల్ కౌన్సిలర్లు 30 మందికి ఒకరు మృతి చెందగా మరొకరు ఉద్యోగం వచ్చి వెళ్లిపోయారు. ఇక 28 మంది మిగిలారు. ఇందులో ఇటీవల 10 మంది టిడిపి కండువా కప్పుకున్నారు. మిగిలిన 18 మంది వైసిపిలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఈనెల 3,4 తేదీలలో సమావేశాన్ని నిర్వహించారు. కోరం లేక రెండు సార్లు వాయిదా పడింది. తాజాగా ఈ నెల 17న వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వైసిపి కౌన్సిలర్లను టిడిపి శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో కోరం లేక ఎన్నిక మళ్లీ నిలిచింది. మంగళవారం మరోసారి నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎన్నిక కోసం 10 మంది టిడిపి కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాగా వైసిపి కౌన్సిలర్లు ఎవరూ రాలేదు. కౌన్సిలర్లను రాకుండా వైసిపి అడ్డుకోవడం సరికాదంటూ ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు నిరసనకు దిగారు. వారు వస్తే టిడిపికి మొగ్గు చూపుతారనే భయంతో వైసిపి కౌన్సిలర్లను చైర్మన్ నివాసంలో దాచేశారన్నారు. ఈ నేపథ్యంలోనే టిడిపి శ్రేణులు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దోసుకుంటూ వైసిపి కౌన్సిలర్లను దాచిన ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఎన్నిక జరగకుండా వైసిపి అడ్డుకోవడంపై ఆందోళన చేపట్టారు. ఎన్నిక జరిగితే ఓడిపోతామనే భయంతో కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, అందుకే ఎన్నికకు హాజరు కాకుండా తమ కౌన్సిలర్లను అడ్డుకుంటున్నారని వైసిపి నేతలు అంటున్నారు.



గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద బైటాయించిన వైసిపి మాజీ ఎంఎల్ఎలు

ఆందోళనకారులు ఎవరూ మున్సిపల్ కార్యాలయం వైపు రాకుండా 100 మీటర్ల దూరం నుంచి పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున రావడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను కార్యకర్తలు నెట్టివేశారు. దాంతో పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. కార్యకర్తలను చెదరగొట్టేందుకు లాఠీ ఛార్జ్ జరగడంతో మరింత ఉద్రిక్తత ఏర్పడింది. దాదాపు 500 మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టిడిపి, వైసిపి కార్యకర్తలు తమ తమ నేతలకు అనుకూలంగా నినాదాలు చేశారు. పోలీసులు చెదరగొట్టిన తర్వాత దూరంగా వెళ్లిపోయారు.

మరోసారి వాయిదా

తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వరుసగా నాలుగోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు ప్రిసైడింగ్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. కోరం ఉండాలంటే 15 మంది అవసరమని మంగళవారం 10 మంది మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేశామన్నారు. ఇక్కడి పరిణామాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్‌కు తెలియజేశామన్నారు.

'చలో తుని' అడ్డగింత

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో సోమవారం జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా 'చలో తుని' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు తునికి పయనమయ్యారు. పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. జక్కంపూడి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణలను హౌస్ అరెస్ట్ చేశారు. ముద్రగడ పద్మనాభం తుని బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. తునికి చేరుకున్న మాజీ ఎంఎల్ఎ వంగా గీతను కారులో అనుచరులతో వెళుతుండగా అడ్డుకున్నారు. గొల్లప్రోలు చెక్ పోస్టు వద్ద కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, అనంతబాబులను నిలిపివేశారు. దీంతో వారు అక్కడే బైటాయించి నిరసన తెలిపారు.

గర్భవతిని అని కూడా చూడకుండా పరిగెత్తించారు

వైస్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొనేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్తుండగా టిడిపి శ్రేణులు తరిమారు. దొరికినోళ్లను దొరికినట్టుగానే కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. తాను గర్భవతి అని కూడా చూడకుండా ఓటు వేయనీయకుండా అడ్డుకున్నారు. తన తల్లిదండ్రులను చూసి రెండు రోజులు అయిందని రెండో వార్డు వైసిపి కౌన్సిలర్ చింతల సునీత మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు అనంతరం మాజీమంత్రి దాడిశెట్టి రాజా వైసిపి కార్యాలయంలో తన అనుచరులతో సమావేశం అయ్యారు. వైసిపి కౌన్సిలర్లను కిడ్నాప్ చేసి తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేశారని టిడిపి నేతలపై ఆరోపణ గుప్పించారు. కౌన్సిలర్లను భయపెట్టి, ప్రలోభపెట్టాలని చూస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

అవగాహన కల్పించేందుకు కృషి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో పిఎం సూర్య ఘర్ పథకంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పిఎం సూర్య ఘర్ ప్యానల్ ఏర్పాటు పురోగతి, పిఎం కుసుమ్ యోజన కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూములు గుర్తింపు వంటి ఇతర అంశాలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఈ పథకం కింద 671 మంది తమ గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. విద్యుత్తు వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సహజ సిద్ధంగా లభించే సోలార్ విద్యుత్ వినియోగం, ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీపై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయంలో సౌర శక్తిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పిఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు రాయితీపై సౌర పంపులు, పునరుత్పాదక ఇంధన ఆధారిత విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయడానికి జిల్లాలో అనువైన భూములను గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో పోలవరం లెఫ్ట్ కెనాల్ ఆనుకుని ఖాళీగా ఉన్న ప్రదేశాలను సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ జి.ప్రసాద్, పోలవరం ప్రాజెక్టు ఎస్ఇ బి.ఏసుబాబు, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జ్ పీడీ ఎ.శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ జగ్గంపేట, పెద్దాపురం ఇఇలు బి.వీరభద్రరావు, ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులును గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక కొత్తపేట, నాగమ్మ పేట, కబడ్డీ వీధి, నువ్వుల గుంట వీధి ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎన్.సూరిబాబు, కె.అప్పన్న, తాడిశెట్టి గంగ, ఎన్.నరసింహమూర్తి, గరగపాటి పెంటయ్య, డి.కృష్ణ, శ్రీనివాస్, అమృత, నమ్రత పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకెలో ఔట్ సోర్సింగ్ డ్రైవర్లను వేధింపులకు గురిచేసేలా యూనివర్శిటీ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఇన్‌ఛార్జ్ విసి మురళీకృష్ణకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ 2008లో జెఎన్‌టియుకెలో వందల సంఖ్యలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారని తెలిపారు. వారి నియామకం సందర్భంగానే విద్యార్హతలు, నైపుణ్యతను పరిశీలించారని గమనించాలన్నారు. తాజాగా ఇచ్చిన సర్క్యులర్ డ్రైవర్స్‌ను వేధించేలా ఉందన్నారు. చాలీచాలని జీతాలతో ఏళ్ళ తరబడి సేవలు అందిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను ఉన్నతాధికారులు గుర్తించాలన్నారు. ఎవరైనా చిరుద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే వారి దృష్టికి తీసుకొచ్చి సరిదిద్దకుండా వారి పొట్ట మీద కొట్టడం సరి కాదన్నారు. దీనిపై ఇన్‌ఛార్జ్ విసి మురళీకృష్ణ స్పందిస్తూ కమ్యూనికేషన్ గ్యాప్‌తో జరిగిందని, తమ వల్ల డ్రైవర్స్‌కే కాదని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎవ్వరికీ అన్యాయం జరగదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ, తదితరులు పాల్గొన్నారు



విసికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలేశ్వరం, ప్రత్తిపాడు

ఈనెల 20న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షుడు పసగడుగుల నానాజీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎపి ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్ వినియోగంలో అవకతవకలు చోటు చేసుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉగ్గిన సతీష్, కోశాధికారి బీరా శ్రీను, నాయకులు పసగడుగుల నూకరాజు, పైల చిన్ని, ఎస్‌కె.అలీషా, కె.దుర్గా, ఎం.సంజయ్, సిహెచ్.లక్ష్మణ్, ఎ.అశోక్, ఎం.రాజేష్ పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రావు మాట్లాడుతూ మీటర్ రీడర్స్ ఎన్నో ఏళ్ల నుంచి చాలీచాలని జీతాలతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈనెల 20న విజయవాడలో జరిగే యూనియన్ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పసగొడుగుల నానాజీ, శ్రీను, పసగొడుగుల నూకరాజు, ఏసుబాబు, వినోద్ పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దేశ సంపదను జాతీయం చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

దేశ సంపదను జాతీయం చేయాల్సిన అవసరం ఉందని దళిత నాయకుడు ఆర్‌ఎస్.రత్నాకర్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణ ద్వారా వందలో ముగ్గురికే లబ్ధి చేకూర్తుందని, దేశంలో ఎస్‌సి జాబితాలో ఉన్న 1108 కులాలకు ఏ విధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ఎస్‌సి వర్గీకరణతో కొందరికే న్యాయం జరుగుతాదని, కావున దేశ సంపదను జాతీయ చేసి అన్ని కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణతో ఎస్‌సి జాబితాలోని అన్ని కులాలకు న్యాయం జరగదని అన్నారు. వర్గీకరణ ప్రక్రియను వెనక్కు తీసుకోకపోతే అధికార పార్టీలకు పతనం తప్పదని హెచ్చరించారు.

ఆలయాలకు పాలకమండళ్లు ఎప్పుడో..?

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని పలు ఆలయాలకు పాలకమండళ్లను ఎప్పుడు నియమిస్తారో తెలియని పరిస్థితి నెలకుంది. గత ప్రభుత్వ పాలనలో కొన్ని దేవాలయాలకు మాత్రమే పాలకమండళ్లను నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటుతున్నా నూతన కమిటీలను నియమించే దిశగా అడుగులు పడటం లేదు. దేవాలయాలకు పాలక మండళ్లు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో పెనుమళ్ళ కోలంక సోమేశ్వర స్వామి ఆలయాలు, కాజులూరులో ప్రసిద్ధిగాంచిన శివాలయానికి పాలకమండళ్లు లేకపోవడంతో ఆలయ నియమ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తక్షణమే ఆయా దేవాలయాలకు పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని యాత్రికులు కోరుతున్నారు.

సూర్యనారాయణ మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెద్దాపురం

విశాఖ జిల్లా ప్రజానాట్యమండలి ప్రజా కళాకారుడు సూర్యనారాయణ మృతికి పెద్దాపురం ప్రజానాట్యమండలి మండల కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ప్రజాలచమండలి మండల అధ్యక్షులు మంతెన సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, సీనియర్ కళాకారులు దారపురెడ్డి సత్యనారాయణ, కేదారి నాగు, దారపురెడ్డి కృష్ణ, మహాపాతిన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూనె తయారీపై 'తేలి' చిత్రం

ప్రజాశక్తి - సామర్లకోట

తెలుకుల, గాండ్ల కులస్తులు తయారు చేస్తున్న నూనె తయారీపై 'తేలి' అనే పేరుతో ఒక చిత్రాన్ని త్వరలోనే తెరపైకి తీసుకురానున్నట్లు సినీనటుడు, సీరియల్ నటుడు మొల్లేటి బాలాజీ అన్నారు. మంగళవారం భీమేశ్వరాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 1983లో 'ఓ ఆడది మగాడు' చిత్రం ద్వారా చిత్ర సీమలోకి అడుగు పెట్టానని గుర్తు చేశారు. మగమహారాజు, మంగమ్మగారి మనవడు వంటి చిత్రాల ద్వారా గుర్తింపు పొంది, సినీ నటులు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున సరసన అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందినట్లు చెప్పారు. నూనె తయారీపై ఒక చిత్రాన్ని తెరపైకి తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పలు చిత్రాల్లో నటిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయంగా రాణిస్తున్న కూచిపూడి నృత్యకారుడు అలమండ ప్రసాద్ సేవలను ఆయన అభినందించారు.



మీడియాతో మాట్లాడుతున్న బాలాజీ

ఎన్‌సిడి సర్వేను సంపూర్ణంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

కేన్సర్ గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఎన్‌సిడి సర్వేను సంపూర్ణంగా నిర్వహించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ నరసింహ నాయక్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని గోరింట గ్రామంలో నిర్వహించిన ఎన్‌సిడి సర్వేని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల కేన్సర్ల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఈ సర్వేతో కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చున్నారు. సర్వే వల్ల జరిగే ఉపయోగాలపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వే నిర్వహణ జరిగిన విధానాలు, సర్వే నిర్వహణలో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర్, పులిమేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రావణి, మల్లాం, పులిమేరు పిహెచ్‌సిల సూపర్‌వైజర్లు భద్రం, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ నరసింహనాయక్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గాడిమొగ కంట్రోల్ సిస్టంలో మరమ్మతులు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ కాకినాడ డివిజన్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు తాళ్లరేవు, సీతారామపురం, కోరంగి, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జిపేట, నీలపల్లి, గాడిమొగ, చినవలసల, పెదవలసల, పత్తిగొంది, చిన బొడ్డు వెంకటాయపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి


డాక్రా మహిళల అభివృద్ధికి కృషి చేయాలని మహిళా సమైక్య అధ్యక్షురాలు కలవల రత్నం అన్నారు. మంగళవారం స్థానిక మహిళా శక్తి కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య సమావేశం ఎపిఎం సన్యాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్త్రీ నిధి, ఉన్నతి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రికవరీ, బ్యాంకు రుణాలపై చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌హెచ్‌జి ఇన్కమ్ సర్వే, లోకోస్ ప్రొఫైల్ సర్వే, లక్పతి దిది అజీవిక రిజిస్టర్ నమోదు, విలేజ్ పోవెర్టీ రిడక్షన్ ప్లాన్ సర్వే, మహిళా రైతు ఉత్పాదక సంఘాల బలోపేతం, స్వచ్ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ అంశాలపై చర్చించారు.

పోటీ పరీక్షల మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - కరప

ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్స్ సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ అందించారు. మంగళవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరీష్ పాల్గొనిరూ.10 వేల విలువ గల పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పోలిశెట్టి తాతీలు, పెంకె రవివర్మ మాట్లాడుతూ కోరిన వెంటనే పుస్తకాలను అందించిన తలాటం హరీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



మెరుగైన విద్యాబోధనకే శిక్షణ

జిల్లాలోని పలు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు మంగళవారం నుంచి ప్రారంభం అయ్యాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, మండలంలోని ఉండూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు శిక్షణా తరగ తులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి, సిడిపిఓ జి.ఉష పాల్గొని మాట్లా డారు. ప్రాథమిక, సెకండరీ విద్యలో పునాది అభ్యసన స్థాయిలను మెరుగుపరిచేందుకు 'సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్'(సాల్ట్) శిక్షణను అంగన్ వాడీలకు ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట ఆధారిత అభ్యసన, పిల్లల అభ్య సనలో తల్లిదండ్రులు, కమ్యూనిటీ భాగ్య స్వామ్యం, సమ్మిళిత విధానాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తీసు కోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్య క్రమంలో హెచ్‌ఎంలు తోటకూర సాయి రామకృష్ణ, కుర్మారావు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక సత్తెమ్మ కాలనీలోని సాగర్ మున్సిపల్ హైస్కూల్లో అంగన్ వాడీలకు శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమం సిడిపిఓ జి.ఉష, ఎంఇఒలు ఇ.ప్రభాకరశర్మ, విఆర్‌కె.చౌదరి అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, ఎంపిడిఒ శ్రీలలిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఈ శిక్షణా తరగతులను అంగన్‌వాడీలు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు జి.రాజు, శివశంకర్, అనిల్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.ఉమాదేవి, టివి. రమణమ్మ, కె.చంద్రకళ, సిహెచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని చేబ్రోలు జడ్‌పి ఉన్నత పాఠవాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిడిపిఒ దుర్గాదేవి, ఎంఇఒ-2 బివిఎస్.ప్రసాద్ ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్స్‌గా మేడసాని సత్యనారాయణ, అనిశెట్టి సీతారామరాజు, ఆకన గణేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మనసా దేవినాగమణి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం దూళిపూడి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని తాళ్ళరేవు, చొల్లంగి జడ్‌పి ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్‌లు కె.సత్యకళ్యాణి, కె.వీరేంద్ర, పిఎస్‌డి.ప్రసాద్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులు 6 రోజులపాటు జరుగుతాయని ఎంఇఒలు మంగాయమ్మ, ఉమ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె. విజయకుమారి, సిడిపిఓ మాధవి, సూపర్‌వైజర్లు నళిని, నిభావని, డివైఇఒ ఎన్.వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం. జె.ఆశాలత పాల్గొన్నారు. **కరప** మండలంలోని వేళంగి జడ్‌పి హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. శిక్షణా తరగతులను ఎంఇఒలు బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో మాట్లాడుతున్న ఎంఇఒ శివరామకృష్ణయ్య



గొల్లప్రోలులో మాట్లాడుతున్న సిడిపిఒ దుర్గాదేవి

నేరాలు ఘోరాలు

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - మండపేట

మండపేట టౌన్ పరిధిలో బాలికపై అత్యాచారం ఘటనపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండపేటకు చెందిన బాలిక పదో తరగతి చదువుతుంది. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ క్రాంతి కుమార్ అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మండపేట పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక గొల్లపుంతకు చెందిన ఆటో డ్రైవర్ క్రాంతికుమార్(25)కు భార్య, కుమారుడు ఉన్నారు. సమీపంలో ఉండే పదవ తరగతి బాలికతో పరిచయం చేసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేష్ తెలిపారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని సొంటివారి పాకలు శివారు ఆరటి తోటలో నిర్వహిస్తున్న సారా బట్టీపై ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లపు వూటను ధ్వంసం చేశారు. 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ చేస్తున్న కొమ్మనబోయిన నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జట్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లలిత ఇండస్ట్రీస్‌లో పని చేస్తున్న బీహార్‌కు చెందిన జట్టు కార్మికుడు షబ్బీర్ ఆలం (34) మంగళవారం బాత్ రూంలో స్నానం చేస్తూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. షబ్బీర్ ఆలం గత కొన్ని రోజులుగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడన్నారు. మంగళవారం స్నానాల గదిలోకి వెళ్లి కుప్పకూలి పడిపోయి మరణించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

మనవడి దాడిలో గాయపడిన చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన జాస్తి శశిరేఖ(60) పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రెండు నెలల క్రితం ఆటల కోసం బయటకు వెళ్లి ఆలస్యంగా వచ్చిన మనవడును శశిరేఖ మందలించింది. దీంతో కోపంతో మనువడు సుత్తితో ఆమె తలపై మోదాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేపరు మిల్లు కార్మికులు ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పేపరుమిల్లు పరిశ్రమ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి ఆందోళనచేపట్టారు. పరంపర స్కీములో జరిగిన ఒప్పందాల ఫలితంగా కార్మికులు గత కొన్ని రోజులుగా పేపరుమిల్లులో నిరసన తెలుపుతున్న విషయం విధితమే. తాజాగా మంగళవారం రాత్రి పరిశ్రమ గేటు లోపల పెట్రోల్ బాటిల్ చేత పట్టుకుని ఆందోళన కొనసాగించారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ ఫైల్స్, రీ ఓపెన్ అర్జీల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పెండింగ్ ఫైల్స్, రీ ఓపెన్ అర్జీలను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, భూ అనుబంధ సంబంధ అర్జీల పరిష్కారం విషయంలో తప్పనిసరిగా జవాబుదారీతనం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో రీ ఓపెన్ అయిన పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, రీ సర్వే అభ్యంతరాలు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అర్జీలను పరిష్కారం చేసే ప్రక్రియలో నిజ నిర్ధారణ, ప్రామాణిక పత్రాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, డిప్యూటీ సర్వేయర్ వై.మోహన్‌రావు, డిటి తదితరులు పాల్గొన్నారు.

నన్నయ విసిగా ప్రసన్నశ్రీ నియామకం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విసిగా సత్తుపాటి ప్రసన్నశ్రీని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అంతరించిపోతున్న గిరిజన భాష కోసం భగత, గదభ, కొలామి, కొండ దొర తదితర 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళగా ప్రసన్నశ్రీ గుర్తింపు పొందారు. 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి నారీశక్తి పురస్కారం అందుకున్నారు. 125 పరిశోధనలకు చేసిన సేవలకు బెస్ట్ టీచర్ అవార్డ్స్, బెస్ట్ ఉమెన్ స్పీకర్ అవార్డు, గిరిజన అరక బ్రహ్మ, దళిత సాహిత్య అకాడమి అవార్డు, ఉమెన్ అచీవర్స్ అవార్డు, ఇండియన్ ఇండిగేనోస్ స్క్రిప్టేర్ అవార్డులను ఆమె పొందారు.

చలో తునికి అడ్డంకులు

వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఇచ్చిన చలో తుని కార్యక్రమానికి అడ్డంకులు తప్పలేదు. మంగళవారం వైసిపి శ్రేణులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్య నేతలను గృహ నిర్బాంధానికి గురి చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం


సామర్లకోట పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు చలో తుని కార్యక్రమానికి బయలుదేరారు. అయితే స్థానిక వైసిపి కార్యాలయం సమీపంలో బడేలమ్మ చెరువు వద్ద పోలీసులు నాయకులను అడ్డగించారు. దీంతో వారు రోడ్డుపై నిరసనకు దిగారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ తమ పార్టీ కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేసి వైస్ ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు సాగిస్తుందన్నారు. చలో తుని కార్యక్రమాన్ని అడ్డుకున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఆ ప్రాంతానికి చేరుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊభా జాన్ మోసెస్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్ కుమార్, తలారి దొరబాబు, వైసిపి కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాడు మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు తుని వెళ్లారు. అయితే తునిలో వారిని పోలీసులు అడ్డుకోవడంతో తిరిగి వచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వైసిపి నేతలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్లు శిడగం వెంకటేశ్వరరావు, నరాల శ్రీను, రామిశెట్టి నాని, జడ్‌పిటిసి బెహరా రాజేశ్వరి, బదిరెడ్డి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు చలో తుని కార్యక్రమానికి వెళ్తున్న వైసిపి నాయకులు కురసాల కన్నబాబు, వంగా గీత, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌సి అనంతబాబులను గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసుందన్నారు. ఒక్క కౌన్సిలర్ కూడా లేని మున్సిపాలిటీలో వైస్ ఛైర్మన్ పదవిని పొందడం కోసం పోటీ పడడం విడ్డూరంగా ఉందన్నారు. తమ నాయకుడిపై జరిగిన దాడిని ఖండించేందుకు తుని వెళ్తున్నామని, తమను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. 144 సెక్షన్ కేవలం వైసిపికే వర్తిస్తుందా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న ముద్రగడ పద్మనాభం


సామర్లకోటలో దొరబాబును అడ్డుకున్న పోలీసులు


సభలో మాట్లాడుతున్న సభాధ్యక్షులు కెల్లా ఆదినారాయణ

ఘనంగా శ్రీధర నిర్మలాశ్రమం వార్షికోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ బొడ్డు చినవెంకటాయపాలెంలో ఉన్న శ్రీధర నిర్మలాశ్రమం 61వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కెల్లా ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు చూపిన మంచి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఉపాధ్యక్షులు కొపనాతి బాలకృష్ణ, సత్యవతి, ఆశ్రమ కార్యదర్శి కొపనాతి వెంకటేశ్వర్లు, భవాని దంపతులు పలువురు గురువులను దుస్సాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షురాలు కొపనాతి మహాలక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహరాజు, కొపనాతి నాగరాజు, షేక్ మొహమ్మద్ అబ్బాస్, అలపాని ఆదినారాయణ, కొప్పిశెట్టి జగపతి, ఆశ్రమ వాసులు పాల్గొన్నారు.


టిడిపి నాయకుల అడ్డుకోవడంతో నిలిచిపోయిన లారీలు

లారీలను అడ్డుకున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నం రాగమ్మ చెరువు సమీపంలోని శిధిల వంతెన వద్ద అధిక లోడుతో వెళుతున్న లారీలను టిడిపి నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని చిన్న బ్రహ్మదేవం గ్రామంలో ఉన్న కెబికె పరిశ్రమ నుంచి అధిక లోడుతో లారీలు తరచుగా తిరుగుతున్నాయని, దీనివల్ల శిధిలవంతెన కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వాహనాలను ఇతర రహదారి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్యం ప్రసన్న, కల్లూరి శ్రీను, సానిపిని సురేష్, నల్లల శ్రీను, ప్రజలు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సామర్లకోట


సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్ కుమార్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈ శ్రమం' ఉచిత బీమా పథకాన్ని కార్మికులు, కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లేబర్ అధికారి రవిశంకర్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బ్రౌన్‌పేట అంబేద్కర్ కాలనీలో వాక్ విత్ క్రైస్ట్ చర్చిలో పాస్టర్ పి.ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శ్రమం నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా 'ఈ శ్రమం' ఉచిత ఇన్సూరెన్స్ పథకానికి నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. బుధవారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని, తెల్ల రేషన్ కార్డు ఉండి 60 సంవత్సరాల లోపు ఉన్న కార్మికులు ఈ శ్రమంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

యానిమేటర్‌పై విచారణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు


గ్రామసభలో విచారిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ బాబూరావు

మండలంలోని చందుర్తి గ్రామంలో డ్వాక్రా యానిమేటర్‌పై వచ్చిన ఫిర్యాదుపై జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బాబూరావు విచారణ నిర్వహించారు. గతంలో యానిమేటర్‌గా పనిచేసిన చీకట్ల కుమారిని తొలగించి ఆమె స్థానంలో మాసరపు పద్మను గ్రామ సంఘం, అధికారులు గత అక్టోబర్ నెలలో నియమించారు. అయితే చీకట్ల కుమారి నన్ను అన్యాయంగా తొలగించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గ్రామసభ ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. మెజార్టీ సభ్యులు యానిమేటర్‌ను మార్చాలని ఈ సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎటిఎం సన్యాసిరావు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స



రైతులకు మందులను పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జి.వేమవరంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై ఎడి బ్రహ్మవేద రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డి.సుధ, వైద్యులు రమణమూర్తి, డి.కళ్యాణి, ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం వైద్యులు జయ భరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో మంగళవారం స్థానిక రాజీవ్‌గాంధీ మున్సిపల్ యుపి స్కూల్ 8వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ భౌతిక శాస్త్రంలో ఘర్షణ, బలాల రకాలు, పీడన ప్రభావం, ఘర్షణ రకాల కు సంబంధించిన అనేక అంశాలపై విద్యార్థులతో ప్రయోగాలు చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే నిర్వహిస్తామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. రీ సర్వే పైలట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపికైన సత్యవాడలోని ప్రధాన రహదారిపై మంగళవారం రీ సర్వేపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీ సర్వేలో ఏవైనా లోపాలుంటే సరిచేసుకునే వీలుందన్నారు. రోవర్ సహాయంతో గ్రౌండ్ ట్రూతింగ్ రీసర్వే సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 27తో ముగుస్తుందని, అనంతరం గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ రీసర్వే ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటే భవిష్యత్తులో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండబోదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, వడ్లూరు విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిగా వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నూరు శాతం వినియోగంలోకి తీసుకురావాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కేంద్రాలు పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలు అన్నీ వినియోగం లేవని, కావున పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి అన్నింటినీ వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను విడివిడిగా సేకరించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణికులు సహకరించాలని ఎస్ఐ పి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. చైన్ స్నాచింగ్, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు నివారించే క్రమంలో వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

కాండ్రకోటలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

భీష్మ ఏకాదశి సందర్భంగా కాండ్రకోటలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గవరసాన గోపాలకృష్ణ, గవరసాన సూరిబాబు, నాగేశ్వరరావు, రాజశేఖర్, తాటికొండ వెంకటేశ్వరరావు, ఒబిలి శెట్టి నాగభూషణం, మాకిరెడ్డి శ్రీను, జోకా నానాజీ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న అరుణ్

చిరస్మరణీయులు బాలాజీదాస్, బిబి.నాయుడు

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నడిపిన జిఎస్.బాలాజీదాస్, బిబి.నాయుడు చిరస్మరణీయులని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. జిఎస్ బాలాజీ దాస్ 22వ వర్ధంతి, బిబి.నాయుడు 8వ వర్ధంతి పురస్కరించుకుని ఎపి పేపరుమిల్లు పరిశ్రమ సమీపంలోని బిటికె భవన్‌లో మంగళవారం సాయంత్రం కార్మిక సభ నిర్వహించారు. తొలుత వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా అరుణ్ పాల్గొని మాట్లాడారు. బాలాజీదాస్ విద్యార్థి దశ నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తన ఉద్యమ ప్రస్థానం ప్రారంభించారన్నారు. ఆ కాలంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్షను అనుభవించారని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం శ్రామికల పక్షాన ప్రజాపోరాటాలు నిర్వహిస్తూ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. రాజమండ్రిలో నిర్వహించిన సిఐటియు తొలి రాష్ట్ర మహాసభకు నాయకత్వం వహించారని, ఆ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శిగా విశేష సేవలందరించారని తెలిపారు. బాలాజీ దాస్ జీవితం చివరి వరకూ కార్మిక పోరాటాలలో క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు. బిబి నాయుడు పేపరు మిల్లులో సాధారణ కార్మికునిగా జీవిత ప్రస్తానం ప్రారంభించి సిఐటియు రాష్ట్ర స్థాయి నాయకునిగా ఎన్నికయ్యారని తెలిపారు.


బాలాజీదాస్‌కు నివాళులర్పిస్తున్న అరుణ్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పరిశ్రమలలో పనిచేసే కార్మికుల పోరాటాలకు దిశానిర్దేశం చేశారని గుర్తు చేశాయి. కడియం, రాజమండ్రి పేపరు మిల్లులు, ఒఎన్‌జిసి కాంట్రాక్టు కార్మికుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాంబాబు మాట్లాడుతూ బాలాజీదాస్, బిబి నాయుడు స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలు మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తుందని వివరించారు. సీనియర్ నాయకులు టి.సావిత్రి మాట్లాడుతూ కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని, ఆ దిశగా పోరాటాలను తీవ్రతరం చేయటమే జిఎస్ బాలాజీదాస్, బిబి నాయుడులకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి. పవన్, టి తులసి, తాతారావు, పేపరుమిల్లు యూనియన్ నాయకులు రాము, సోమేశ్వరరావు, కాంతారావు, ఇతర నాయకులు మాతారావు, జరీనా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని ఎఒ బి.రాజారావు తెలిపారు. మంగళవారం మండలంలోని దొండపూడి, రాజంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందాలంటే గుర్తింపు సంఖ్య తప్పనిసరి అన్నారు. రైతులు వారి ఆధార్ కార్డు, పొలం వివరాలను సమీపంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆధార్ లింకు అయిన మొబైల్ నెంబర్‌ను తీసుకెళ్లాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన 19వ విడత నిధులు జమ కావడానికి కూడా ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. మార్చి 25లోగా దీన్ని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు వ్యవసాయ ఉద్యాన సిబ్బంది మంగతాయారు, బిందు పాల్గొన్నారు.

మహాశివరాత్రిపై సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

మంగళవారం సీతానగరం మండలంలోని ఎంపి డిఒ కార్యాలయంలో శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా పట్టిసీమ ఏర్పాట్లకు సంబంధించి ఉత్సవ కమిటీలు, కూటమి నాయకులు సమీక్షా సమావేశం నిర్వహించారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తదితరులతో పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.

జిబిఎస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గుయ్లెన్ బారో సింద్రోమ్ (జిబిఎస్) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపించగానే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. జిబిఎస్‌కు ముందస్తు జాగ్రత్త చర్యలపై వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 16 కేసులు నమోదు అయ్యాయని, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో 2 కేసులు వస్తే పరీక్షల కోసం కాకినాడ పంపించారని చెప్పారు. జిబిఎస్ బాధితుల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసోలేషన్ ఏర్పాటు చేశారని, తెలిపారు. అవసరమైన మందులు, ఇంజక్షన్లు సిద్ధంగా ఉంచారని తెలిపారు. ఒక పేషెంటుకు ఐదు రోజులపాటు ఐదు ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని, బయట ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ. 20 వేల వరకు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రిలో దీనిని ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టిడిపి నగర ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, మరుకుర్తి రవి యాదవ్, ఆసుపత్రి కమిటీ సభ్యులు ఉన్నారు.